క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొయినాబాద్: విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం మండల పరిధిలోని కొన్ని ఫీడర్ల పరిధిలో ఒక్కో గంట పాటు విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ ఏఈ హమునాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనకమామిడి ఫీడర్ పరిధిలో ఉదయం 7 నుంచి 8 గంటలవరకు, ఎస్వీ కాలేజీ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి 9 గంటలవరకు, తోలుకట్ట ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 10 గంటలవరకు, కేతిరెడ్డిపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటలవరకు, నక్కలపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు, బ్రౌన్‌టౌన్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటలవరకు, శ్రీనిధి–2 ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గంటలవరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా ఫీడర్ల పరిధిలోని కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, తోలుకట్ట, నక్కలపల్లి, సజ్జన్‌పల్లి, ఎత్‌బార్‌పల్లి, నాగిరెడ్డిగూడ, అజీజ్‌నగర్ గ్రామాలతో పాటు ఫాంహౌస్‌ల విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



జ్ఞానతేజకు గోల్డ్ మెడల్ అందిస్తున్న కరాటే మాస్టర్లు

షాబాద్: విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని మాస్టర్లు సియాన్, సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని లక్ష్మరావుగూడ గ్రామానికి చెందిన మేకల జ్ఞానతేజ కరాటేలో గోల్డ్ మెడల్ సాధించింది. మొయినాబాద్‌లోని కాకతీయ హైస్కూల్‌లో విద్యార్థి 2వ తరగతి చదువుతోంది. మొయినాబాద్‌లో గ్లోయింగ్ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అందులో మేకల జ్ఞానతేజ ప్రతిభ కనబరిచిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

డీకే అరుణను కలిసిన నాయకులు



డీకే అరుణను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను సోమవారం షాద్‌నగర్‌కు చెందిన ఆ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న డీకే అరుణ నివాసంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, కమ్మరి భూపాలచారి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆమెను కలిశారు. ఈ సందర్భంగా నాయకులు డీకే అరుణకు శాలువా కప్పి సన్మానించారు. షాద్‌నగర్‌లో లోక్‌సభ ఎన్నికల్లో జరిగిన పోలింగ్ తీరును ఆమె నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కందూరు మనోహర్‌రెడ్డి, చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాసుల పంపిణీ



బస్‌పాసులను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ, అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గౌరెల్లిలో సోమవారం స్థానిక ఎంపీటీసీ గ్యార బాలలింగస్వామి ఆధ్వర్యంలో హైదరాబాద్–2 ఆర్టీసీ డిపో అధికారులు దివ్యాంగులకు ఉచిత బస్‌పాసులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 50 మంది దివ్యాంగులు డిస్టిక్ బస్ సర్వీసుల్లో ప్రయాణించేందుకు వీలుగా ఆర్టీసీ అధికారుల సహకారంతో బస్‌పాసులు అందించినట్లు ఎంపీటీసీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారి శివరాజ్‌తో పాటు స్థానికులు మహేశ్, నరహరి, భానుచందర్, కృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హరితహారానికి సర్వం సిద్ధం

- నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు
- షాబాద్ మండలంలో 4.51లక్షల పెంపకమే లక్ష్యం
- వర్షాలు పడగానే ప్రారంభించాలని నిర్ణయం



గొల్లూరుగూడలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో అపర్ణ, ఏపీవో వీరాసింగ్

షాబాద్: గత ప్రభుత్వం హరిత తెలంగాణ సాధించాలనే లక్ష్యంతో 2014లో హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతీ ఏటా అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతీ గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీని ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు పెంచారు. ప్రస్తుతం మండంలోని అన్నీ గ్రామ పంచాయతీల్లో నర్సరీలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. మొదటి వర్షం పడగానే గుంతలు తీసి రెండో వర్షం పడగానే మొక్కలు నాటాలని అధికారులు భావిస్తున్నారు. వర్షాలు ప్రారంభమైతే జూన్, జూలై మాసంలో మొక్కలు నాటేందుకు ప్రభుత్వం, ఆయా గ్రామ పంచాయతీల అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు.

నాటేందుకు ఏర్పాట్లు..

వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు ముందస్తుగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో 41 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతీ గ్రామ పంచాయతీలోని ఒక్కో నర్సరీలో 8వేల చొప్పున మొత్తం 4.51 లక్షల మొక్కలను పెంచారు. నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా బోర్లు, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటిని అందించడంతో పాటు ఎండకు ఎండిపోకుండా గ్రీన్ నెట్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా అందులో పెరిగిన పిచ్చిమొక్కలను ఎప్పకప్పుడూ తొలగిస్తున్నారు.

వివిధ రకాల మొక్కలు..

ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీల్లో పండ్ల, పూల, అటవీ మొక్కలను పెంచుతున్నారు. అందులో భాగంగానే జామ, ఉసిరి, అల్లనేరేడు, చింత, మామిడి, సీతాఫలం, దానిమ్మ, కర్జూరా, బాదం, వంటి పండ్ల మొక్కలతో పాటు గులాబీ, మల్లె, మందరం పూల మొక్కలను పెంచుతున్నారు. వీటితో పాటు రోడ్లకు ఇరువైపులా నాటేందుకు టేకోమ, ఫీడ్లోఫాం వంటి మొక్కలు అందుబాటులో ఉన్నాయి. గతంతో పోల్చితే ప్రజలు ఇష్టపడే వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నారు.

వర్షాలు ప్రారంభం కాగానే



మండలంలోని 41 గ్రామ పంచాయతీలలో నర్సరీలు ఉన్నాయి. అందులో ప్రజలకు అవసరమైన మొక్కలను పెంచాం. అన్ని నర్సరీలలో ప్రస్తుతం మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు ప్రారంభం కాగానే మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాం.

–వీరాసింగ్, ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్, షాబాద్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తాళ్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు

షాబాద్: మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 2005–06 బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నాగర్‌గూడలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను వేదికపైకి పిలిచి సన్మానించారు. వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడిన విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. వారందరూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కొత్తూరు: పట్టణంలోని జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో 2002–2003లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా వారు తాము చదువుకునే రోజులను, ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు.

అలరించిన వీధి నాటకం



వీధి నాటకంలో పాటలు పాడుతున్న పాత్రదారులు

షాబాద్: మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన చూపరులను అలరించింది. రెండు రాత్రుల నుంచి నిర్వహిస్తున్న నాటాకాన్ని చూడడానికి మండలంలోని మన్‌మర్రి, అంతారం, కుర్వగూడ, కక్కులూర్, లింగారెడ్డి, అప్పారెడ్డిగూడ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారు. పంతులు గంగపూరం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ నాటకం నిర్వహిస్తున్నారు. మొదటిరోజు భూబారం భరించలేక భూదేవి విష్ణుదేవునితో మొరపెట్టుకొనుట, బ్రహ్మంగారు పుట్టుట గురించి వీధి నాటం ద్వారా వివరించారు. రెండోరోజు బ్రహ్మంగారు అచ్చమ్మ గోవుల కాయుట, కాలజ్ఞానం రాయుట, పోలేరమ్మ జాతర వరకు జరిగింది. వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రను ప్రజలకు కళ్లకు కట్టినట్లుగా వివరిస్తూ పాటలు, ఆటలతో ఆకట్టుకుంటున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగపూరం కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సరళ రాంచంద్రారెడ్డి, గ్రామస్తులు తదితరులున్నారు.

విద్యార్థుల ప్రతిభ అభినందనీయం



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

కేఎల్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ కోనేరు సత్యనారాయణ

మొయినాబాద్‌రూరల్: కేఎల్ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని కేఎల్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ కోనేరు సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో గల కేఎల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో చదువుతున్న గ్రాడ్యుయేటింగ్ విద్యార్థులు వందశాతం ప్లేస్‌మెంట్స్ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభ అభినందనీయమన్నారు. విద్యారంగంలో విద్యతో పాటు విజ్ఞానాన్ని ఆరితేరిన విద్యార్థులందరూ ఉద్యోగాలు పొందడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్లేస్‌మెంట్‌లో 620 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. బీటెక్ సీఎస్ఈ బ్యాచ్‌కు చెందిన విద్యార్థిలు మంచి కంపెనీలలో ఉద్యోగం సంపాదించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో వైస్ ఛాన్స్‌లర్ కోనేరు లక్ష్మణ్, అవిశ్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివలింగానికి ప్రత్యేక పూజలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కనకమామిడి సంగమేశ్వర దేవాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. జంట నగరాలతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శివలింగానికి ప్రత్యేక పూజల్లో భాగంగా క్షీరాభిషేకం చేసిన అనంతరం పాటు పూలు, పండ్లతో అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. విచ్చేసిన భక్తులకు స్వామివారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

ఆమనగల్లు: ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి హెచ్చరించారు. మండలంలోని ఆకుతోటపల్లిలో ఉన్న పలు ఫర్టిలైజర్ షాపులను సోమవారం ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, షాప్‌లో ఉన్న నిల్వలను ఆమె పరిశీలించారు. ఎరువుల షాపుల యజమానులు ఎప్పటికప్పుడూ స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. వానాకాలం సీజన్‌లో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే విధిగా రసీదులు ఇవ్వాలన్నారు.

శిథిలావస్థ భవనాలను గుర్తించండి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ వ్యాప్తంగా పాత, శిథిలావస్థ గృహాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. రోడ్లు, వీధుల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ భార్గవ్‌రెడ్డి, టీపీఎస్ వెంకట రఘునాథ్, మల్లేశ్, వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



ఉపాధి కూలీల హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ఉపాధి పనుల్లో నిబంధనలు పాటిస్తేనే కూలీ గిట్టుబాటు అవుతుందని.. సమయం వృథా చేయకుండా పనులు చేయాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి ఉపాధి కూలీలకు సూచించారు. యాచారంలో సోమవారం ఆయన ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా కూలీలు నింబంధనల మేరకు ఉపాధి పనులు చేయాలని సూచించారు. కూలీలు ప్రారంభించే సమయం, ముగించే సమయాల్లో ఖచ్చితంగా ఫొటోలు తీసి ఉంచాలని సిబ్బందికి తెలిపారు. పనులు చేసిన వెంటనే పేస్లిప్పులు అడగాలని, వేతనాల్లో జాప్యం జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని కూలీలకు సూచించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు అన్ని గ్రామాల్లో గుంతలు సిద్ధం చేసి ఉంచాలని ఈజీఎస్ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు



రైతులకు జనుము విత్తనాలు అందజేస్తున్న ఏఓ శ్రీలత

కడ్తాల్: మండల కేంద్రంలోని అగ్రి రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువులు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీలత సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని అగ్రి రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువుతో భూసారం పెంపొందుతుందని, పంట దిగుబడిలో పచ్చిరొట్ట ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. వర్షాకాలంలో రైతుల కోసం 60% సబ్సిడీతో జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జనుము విత్తనాలు ఎకరాకు 12 నుంచి 15 కేజీల విత్తనాలను పొలంలో ఒత్తుగా చల్లుకొని, 30 నుంచి 45 రోజుల మధ్య పూత దశలో ఉన్నప్పుడు దుక్కిని కలియదున్నడం ద్వారా 10 నుంచి 12 టన్నుల పచ్చిరొట్ట లభ్యమవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అగ్రిసేవా కేంద్రం సిబ్బంది, రైతులు ఉన్నారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం!

- నిధులు మంజూరైనా మరమ్మతులకు నోచుకోని వైనం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



శ్రీరాంనగర్-సురంగల్ రోడ్డు దుస్థితి

మొయినాబాద్: గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. గత పదేళ్లుగా రోడ్లకు మరమ్మతులు లేక పోవడంతో చాలా గ్రామాల రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరై అసెంబ్లీ ఎన్నికల ముందే శంకుస్థాపనలు చేశారు. కానీ ఇప్పటివరకు మాత్రం పనులు మొదలు పెట్టలేదు. దీంతో వాహనదారులు, స్థానిక ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. మండలంలోని పది గ్రామాల రోడ్లకు గత ప్రభుత్వం 2023 ఆగస్టులో సుమారు రూ.24 కోట్ల నిధులు మంజూరు చేసింది. వెంటనే అదే సంవత్సరం సెప్టెంబర్ నెలలో అప్పటి మంత్రి సబితాఇంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి శంకుస్థాపనలు సైతం చేశారు. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు చేపట్టలేదు. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక కూడా పనులు మొదలుకాలేదు. ఆ తరువాత లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చింది. అయితే రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరైనా టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని అధికారులు చెబుతున్నారు.

ఇబ్బంది పడుతున్న వాహనదారులు..

మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం–చందానగర్, ఎనికేపల్లి–బాకారం, నక్కలపల్లి–వెంకటాపూర్, సురంగల్–వెంకటాపూర్, మొయినాబాద్–ముర్తూజగూడ, కనకమామిడి–వెంకటాపూర్, తోలుకట్ట–ఎత్‌బార్‌పల్లి–నక్కలపల్లి, నాగిరెడ్డిగూడ–బాకారం గ్రామాల రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. ఆయా గ్రామాల రోడ్లను గత పదేళ్లుగా పట్టించుకోలేదు. 2014లో కొన్ని రోడ్లకు రీబీటీ వేశారు. ఆ తరువాత ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదు. గత మూడేళ్లుగా వర్షాలకు రోడ్లన్నీ బాగా దెబ్బతిన్నాయి. గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రాత్రి సమయాల్లో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు నిమిషాల్లో వెళ్లాల్సిన దూరం గుంతల కారణంగా అరగంటకు పైగా సమయం పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరైనా మొదలుకాని పనులు..

- కనకమామిడి–వెంకటాపూర్ రోడ్డు అభివృద్ధికి రూ.6.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ పూర్తయి కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ కూడా అయ్యింది. కానీ ఇంతవరకు పనులు మొదలు పెట్టడంలేదు.
- పెద్దమంగళారం–చందానగర్ రోడ్డు అభివృద్ధికి రూ.2.80 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీనికి అధికారులు టెండర్ పిలిచారు. కానీ ఇంకా టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు.
- శ్రీరాంనగర్–అమ్డాపూర్ రోడ్డుకు రూ.3.50 కోట్ల నిధులు మంజూరు కావడంతో పనులు జరుగుతున్నాయి.
- తోలుకట్ట–నక్కలపల్లి రోడ్డు ప్యాచ్ వర్క్‌కు రూ.1.20 కోట్లు నిదులు మంజూరయ్యాయి. టెండర్ దశలో ఉంది.
- నక్కలపల్లి–వెంకటాపూర్ రోడ్డులో కల్వర్టు నిర్మాణం, ప్యాచ్ వర్క్‌కు రూ.38.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు మొదలుకాలేదు.
- సురంగల్–వెంకటాపూర్ రోడ్డుకు రూ.1.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ దశలో ఉంది.
- ఎనికేపల్లి–బాకారం రోడ్డు మరమ్మతులకు రూ.2.50కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచారు.
- నాగిరెడ్డిగూడ–బాకారం రోడ్డు అభివృద్ధికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ జరుగుతోంది.
- మొయినాబాద్–ముర్తూజగూడ–అమ్డాపూర్ రోడ్డు వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.2.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి.టెండర్ పూర్తయింది.



గుంతలమయంగా వెంకటాపూర్-కనకమామిడి రోడ్డు

పనులు వెంటనే మొదలుపెట్టాలి



రోడ్ల మరమ్మతులకు ఎన్నికల ముందు నిధులు మంజూరు చేసి ఉరుకులు, పరుగులతో శంకుస్థాపనలు చేశారు. కానీ ఇప్పటివరకు పనులు చేపట్టడం లేదు. రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని త్వరగా రోడ్లు వేసే విధంగా చూడాలి.

–సంతోష్, సురంగల్, మొయినాబాద్ మండలం

టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది



మండలంలోని కొన్ని గ్రామాల రోడ్లకు గత ప్రభుత్వ అయాంలో నిధులు మంజూరు అయ్యాయి. కొన్ని రోడ్లకు టెండర్లు పూర్తయ్యాయి, మరికొన్ని రోడ్లకు టెండర్లు కొనసాగుతున్నాయి. శ్రీరాంనగర్–అమ్డాపూర్ రోడ్డు పనులు మాత్రం జరుగుతున్నాయి. ఎన్నికల కోడ్ పూర్తైన తరువాత మిగతావి కూడా మొదలవుతాయి.

–విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ, మొయినాబాద్